పత్తి రైతుకు వర్షం దెబ్బ

- వరుస వానలతో ఎర్రబారుతున్న పత్తి పైరు
- మొదటి దశ పత్తి దిగుబడిపై తీవ్ర ప్రభావం
- క్రాప్ ఇన్సూరెన్స్ లేకపోవడంతో తీవ్ర నష్టం
- నియోజకవర్గంలో 9,045 ఎకరాల్లో పత్తి సాగు



శనివారం రాత్రి కురిసిన వర్షానికి మునగపాడు శివారు పత్తి పైరులో నిలిచిన నీరు



వర్షాలకు భూమిలో తేమ శాతం తగ్గక జి.కొండూరు శివారులో వేరు కుళ్లిపోయి చచ్చిపోతున్న పత్తి పైరు

జి.కొండూరు: వరుసగా కురుస్తున్న వర్షాలతో పత్తి పైరు ఎర్రబారుతోంది. పెట్టుబడి పూర్తయి దిగుబడి కోసం ఎదురుచూస్తున్న రైతుల ఆశలపై వర్షం నీళ్లు చల్లుతోంది. భూమిలో తేమ శాతం తగ్గక ఎరుపు తెగులు ఆశించింది. కొన్నిచోట్ల పైరు నల్లబడి ఎండిపోతోంది. పత్తి తీతకు వచ్చి విచ్చుకోకపోవడంతో పత్తి గుబ్బలుగా మారి నల్లబడి పోతుండడంతో సరైన ధర లేక రైతులు నష్టపోతున్నారు. ఆపదలో ఆదుకోవాల్సిన క్రాప్ ఇన్సూరెన్స్ కూడా లేకపోవడంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.

ఎకరానికి రూ.40 వేల వరకు ఖర్చు..

సొంత భూమి సాగు చేసే రైతులు ఎకరానికి రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఇప్పటికే ఖర్చు చేశారు. ఇక కౌలు రైతులు అయితే కౌలు రూ.10 వేల నుంచి రూ.15 వేలు కలిపితే అన్ని ఖర్చులు కలిపి ఇప్పటికే రూ 40 వేల వరకు ఖర్చు చేశారు. పత్తి పూత దశలో ప్రతి రోజూ వర్షం పడుతుండడంతో భూమిలో తేమ శాతం తగ్గక పైరు ఎర్రబారుతోంది. పూత రాలిపోతోంది. తీతకు వచ్చిన పత్తి కూడా సక్రమంగా తయారు కాకపోవడంతో పత్తి 50 శాతానికిపైగా గుబ్బలుగా ఉండిపోవడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఇప్పటికే ఉన్న కాయలు కూడా వర్షాలకు మచ్చ వచ్చి రాలిపోతున్నాయి. ఉన్న పైరు కూడా పూత, కాత లేకపోవడంతో మరలా ఎరువులు, పై మందులు అధికంగా వాడితే తప్ప పూత వచ్చే అవకాశం లేకపోవడంతో రైతులకు పెట్టుబడి భారంగా మారే అవకాశం ఉంది.

నాణ్యత లేక ధర పతనం

వర్షాల వల్ల నాణ్యత కోల్పోయి గుబ్బల రూపంలో పత్తి దిగుబడి రావడంతో క్వింటా పత్తి ధర రూ.3 వేల నుంచి రూ.4 వేలు కూడా పలకకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. క్వింటా పత్తి తీయడానికి అవసరమైన కూలీలకు అందించే డబ్బులకు సరిపడా కూడా క్వింటా పత్తి ధర పలకకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికీ వర్షాలు తగ్గుముఖం పట్టకపోవడంతో పత్తిపై ఇక ఆశలు వదిలేసుకోవడమేనని రైతులు చెబుతున్నారు

క్రాప్ ఇన్సూరెన్స్ లేదు

ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులకు నష్టం వాటిల్లకుండా ఉండేందుకు గత ప్రభుత్వంలో ఈ క్రాప్ చేయించిన ప్రతి రైతుకు ఉచితంగా క్రాప్ ఇన్సూరెన్స్ వర్తించేలా నిబంధనలను అమలు చేశారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత క్రాప్ ఇన్సూరెన్స్‌ను ఎత్తివేయడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పత్తి పైరులో ఈ ఏడాది వచ్చే నష్టం క్రాప్ ఇన్సూరెన్స్ ఉండి ఉంటే కొంత మేర తగ్గేదని, క్రాప్ ఇన్సూరెన్స్ లేకపోవడం వల్ల తీవ్రంగా నష్టపోతామని రైతులు వాపోతున్నారు.

9,045 ఎకరాల్లో సాగు..

మైలవరం నియోజకవర్గంలోని మైలవరం, జి.కొండూరు, రెడ్డిగూడెం, ఇబ్రహీంపట్నం మండలాల్లో 9,045 ఎకరాల్లో ఈ ఏడాది పత్తి సాగు చేపట్టగా అధిక వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. జి.కొండూరు మండల పరిధిలో అధికంగా 6,200 ఎకరాల్లో పత్తి సాగవుతుండగా కౌలు రైతులే అధికంగా ఉన్నారు. ఇప్పటికే కౌలు మొత్తం చెల్లించి పెట్టుబడి కూడా పూర్తయిన నేపథ్యంలో దిగుబడి వచ్చే అవకాశం లేక తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

తీవ్రంగా నష్టపోతాం



సొంతది రెండు ఎకరాలు, కౌలుకి తీసుకున్న మూడు ఎకరాలు కలిపి నేను ఐదు ఎకరాల్లో పత్తి సాగు చేశా. వర్షాలకు పూత రాలిపోయి కాయ లేకుండా పోయింది. పైరు అంతా ఎర్రబడిపోతోంది. క్రాప్ ఇన్సూరెన్స్ ఉంటే నష్టం లేకుండా ఉండేది. మరలా పెట్టుబడి పెట్టినా ఈ సారి వచ్చే పూత, కాత నిలుస్తుందో, లేదో అనుమానంగా ఉంది.

– తగరపు ఏలియా, రైతు, చెవుటూరు గ్రామం

ఎరుపు తెగులు వచ్చింది



నాలుగున్నర ఎకరాలు కౌలుకి తీసుకుని పత్తి సాగు చేశా. ఇప్పటివరకు రూ.1.5 లక్షలకు పైగా ఖర్చు చేశా. వర్షాలకు తేమ తగ్గక ఎరుపు తెగులు వచ్చింది. కాయలు మొత్తం ఎరుపు రంగులోకి మారి సక్రమంగా పత్తి రావడం లేదు. ఈ ఏడాది తీవ్రంగా నష్టపోతాం. క్రాప్ ఇన్సూరెన్స్ ఉంటే నష్టం కొంత మేర తగ్గేది.

– రమావతు శ్రీను, రైతు, మునగపాడు గ్రామం

క్లుప్తంగా

మేకా ప్రతాప్ దీపావళి శుభాకాంక్షలు



నూజివీడు: మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు నియోజకవర్గ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. దుష్ట శక్తులపై దైవ శక్తి ఎప్పటికీ విజయాన్ని సాధిస్తూనే ఉంటుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలంతా పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధిగా గుంజా శ్రీనివాస్



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధిగా కొండపల్లి మున్సిపాలిటీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్‌లీడర్ గుంజా శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ సిఫార్సుల మేరకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగింది. ఇప్పటికే మున్సిపాల్టీ ఫ్లోర్‌లీడర్‌గా ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఆయన తన గళం వినిపిస్తున్నారు. జిల్లా అధికార ప్రతినిధిగా తన గళాన్ని జిల్లా స్థాయిలో వినిపించాలని నాయకులు కోరారు. శ్రీనివాస్‌ను పార్టీ పట్టణ నేతలు, కార్యకర్తలు అభినందించారు.

బీమా చెక్కు అందజేత



ఇబ్రహీంపట్నం: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ ఇన్సూరెన్స్ పరిధిలోని పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పాలసీకి చెందిన రూ.20 లక్షల చెక్కును బాధిత కుటుంబానికి ఎస్‌బీఐ ప్రాంతీయ మేనేజర్ ఎన్. శ్రీనివాసరావు ఆదివారం అందజేశారు. ఇబ్రహీంపట్నానికి చెందిన ఎస్.వెంకటేశ్వరరావు భార్య ఎస్.మేరీఅమ్మ విద్యుత్ షాక్‌కు గురై ఇటీవల మృతిచెందింది. ఆమె పేరిట ఉన్న పీఏఐ పాలసీ కింద బీమా నగదు చెక్కు అందజేశారు. ప్రాంతీయ మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు, శాఖ ప్రధాన మేనేజర్ వంశీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు మార్జిన్‌లో తుప్పల తొలగింపు



సాక్షి స్పందన

చాట్రాయి: మండలంలోని కృష్ణారావుపాలెం–చనుబండ గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్జిన్ల పక్కన ఉన్న తుప్పలను ఎట్టకేలకు తొలగించారు. ప్రమాదాలకు నిలయంగా రోడ్డు మార్జిన్లు శీర్షికన ఈ నెల 12న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆర్ అండ్ బీ అధికారులు స్పందించారు. రోడ్డు మార్జిన్లలో ఉన్న తుప్పలను తొలగింపజేశారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

ఇబ్రహీంపట్నం: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపుపై ఇబ్రహీంపట్నంలోని మూడో సచివాలయం వద్ద డ్వాక్రా మహిళలకు అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. బీజేపీ ఆత్మనిర్భర్ భారత్ కన్వీనర్ పల్లెం కృష్ణమూర్తి, రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ, రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నాగలక్ష్మి మాట్లాడారు. నాయకులు నూతలపాటి బాల కోటేశ్వరరావు, మారాసు కృష్ణమోహన్, తమ్మినేని మాధురి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ట్రంప్ టారిఫ్‌లతో తీవ్ర నష్టాలు : సీపీఎం

నందిగామరూరల్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధం భారత్‌తో సహా ప్రపంచ దేశాలన్నింటిపై తీవ్ర ప్రభావం చూపుతోందని సీపీఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు కోట కల్యాణ్ ఆందోళన వ్యక్తంచేశారు. సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గాంధీసెంటరులో అమెరికా ట్రంప్ టారిఫ్ సుంకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ట్రంప్ టారిఫ్‌లు భారత్‌లోని వ్యవసాయరంగంతో పాటు పారిశ్రామికోత్పత్తి, సేవారంగాలను దెబ్బతీసిందన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలోని టెక్స్‌టైల్స్, గార్మెంట్స్, పట్టు తదితర రంగాలపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. ఉద్యోగులు, కార్మికులతోపాటు రైతులు కూడా రోడ్డున పడే దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి తరుణంలో దేశ ప్రయోజనాలను కాపాడుకునేలా ప్రత్యామ్నాయ మార్గాలను అందిపుచ్చుకోవలసిన కేంద్రప్రభుత్వం అందుకు విరుద్ధంగా ట్రంప్ అడుగులకు మడుగులొత్తుతూ లొంగుబాటు వైఖరిని ప్రదర్శిస్తోందని ఆగ్రహం వక్తం చేశారు. సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు మోదుగుల పరామర్శ

మైలవరం: వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు, మైలవరం ఉప సర్పంచ్ చామల సీతారామిరెడ్డిని ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పార్లమెంట్ నియోజకర్గ పరిశీలకుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి ఆదివారం ఆయన నివాసంలో పరామర్శించారు. ఇటీవల సీతారామిరెడ్డి మాతృమూర్తి మృతిచెందారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు పాలంకి విజయభాస్కరరెడ్డి పాల్గొన్నారు. అలాగే మండలంలోని మొర్సుమల్లి గ్రామానికి చెందిన సొసైటీ మాజీ అధ్యక్షుడు వైఎస్సార్ సీపీ నాయకులు గొల్లపూడి సుబ్బారావు ఇటీవల మృతిచెందారు. మృతుని తండ్రి నాగేశ్వరరావును, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైలవరం మండల అధ్యక్షులు గర్నేపూడి వెంకటరావు, తోట తిరుపతిరావు, మాడపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సీతారావమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వేణుగోపాలరెడ్డి తదితరులు

దీపావళి సందడి ప్రారంభం

నూజివీడు: పట్టణంలో దీపావళి సందడి ప్రారంభమైంది. బాణసంచా దుకాణదారులు, కొనుగోలుదారుల హడావుడితో కోలాహలంగా మారింది. పట్టణంలో దీపావళికి తాత్కాలికంగా ఏర్పాటు చేసుకునేందుకు 15 బాణసంచా దుకాణాలకు అధికారులు అనుమతులు ఇచ్చారు. ఈ దుకాణాలను పట్టణంలోని విస్సన్నపేట రోడ్డులో లారీ అసోసియేషన్ యూనియన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేశారు. ఇక్కడ హోల్‌సేల్‌తో పాటు రిటైల్ దుకాణాలు కూడా ఏర్పాటయ్యాయి. టపాకాయల కొనుగోలుకు పిల్లలు, పెద్దలు, మహిళలు పెద్దఎత్తున దుకాణాల వద్దకు చేరుకుంటున్నారు. నిబంధనల ప్రకారం దుకాణాలు ఏర్పాటు చేసేలా రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రతి దుకాణం వద్ద ముందు జాగ్రత్త చర్యగా డ్రమ్ములలో నీళ్లు, బకెట్‌లలో ఇసుక ఏర్పాటు చేశారు. వ్యాపారులందరూ గన్నవరం, తాడేపల్లిగూడెం తదితర ప్రాంతాలలోని హోల్‌సేల్ వ్యాపారుల వద్ద కొనుగోలు చేసి ఇక్కడ విక్రయాలు చేస్తున్నారు.



నూజివీడులోని బాణసంచా దుకాణాలు

వాలీబాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



వాలీబాల్ జట్టుకు ఎంపికైన త్రివిధ విద్యార్థులు



ఎంపికైన చిత్తపూరు జెడ్పీ విద్యార్థులతో ఉపాధ్యాయులు

చాట్రాయి: జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–14 వాలీబాల్ పోటీలకు చిత్తపూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఇద్దరు ఎంపికయ్యారని హెచ్‌ఎం సౌభాగ్యం తెలిపారు. ఈ నెల 17న విస్సన్నపేట మండలం నర్సాపురం హైస్కూల్లో నిర్వహించిన డివిజనల్ స్థాయి పోటీల్లో ఎ.సంపత్, కార్తీక్ ఎంపికయ్యారని, వీరు ఈ నెల 21న గుడివాడలో నిర్వహించనున్న జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

వాలీబాల్ జట్టుకు ఎంపికైన విద్యార్థులు

నూజివీడు: ఎస్‌జీఎఫ్ వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చూపి జిల్లా స్థాయిలో ఆడేందుకు సబ్‌జోన్ వాలీబాల్ జట్టుకు త్రివిధ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ సబ్బినేని శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. అండర్–14 బాలుర విభాగంలో జే.నాగ హృదిక్, ఎ. మోక్షజ్ఞ, అండర్–17 బాలుర విభాగంలో సీహెచ్ రాహుల్, బాలికల విభాగంలో టి. లాస్య ఎంపికయ్యారని వివరించారు.

వెయ్యి మందికి వైద్యసేవలు

తిరువూరు: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం తిరువూరులో మధుమేహ రోగుల ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఫ్యాక్టరీ సెంటర్‌లోని నాగార్జున స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో రక్తపోటు, మధుమేహం, మూర్ఛ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు. వెయ్యి మంది రోగులకు ఈ శిబిరంలో వైద్య సేవలందించామని జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ రవీంద్ర తెలిపారు. మధుమేహం, రక్తపోటు, ఫిట్స్ బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, చేయాల్సిన వ్యాయామం, ఆహారం తదితర అంశాలను రోగులకు వివరించారు. వైద్యులు సత్యతేజ, లక్ష్మణరావు, అనీషారాయ్ రోగులకు వైద్య సేవలు అందించారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఉచిత బస్సుల కోసం ఎదురుచూపులు

ఆగిరిపల్లి: ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టినప్పటి నుంచి బస్సు సర్వీసులను తగ్గించి వేయడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ప్రతి రోజూ ఆగిరిపల్లి నుంచి విజయవాడకు వందల మంది ప్రయాణిస్తుంటారు. తగినన్ని బస్సు సర్వీసులు లేకపోవడంతో బస్టాండ్ వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్ వద్దకు వచ్చినా బస్సులో ఖాళీ లేదంటూ ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తూ ఎక్కించుకోకుండా వెళ్లిపోతున్నారని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో 15 నిమిషాలకు ఒక బస్సు ఉండేది. ఇప్పుడు 40 నిమిషాలు అయినా బస్సులు అందుబాటులో ఉండటం లేదని విమర్శిస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం మహిళా ఉద్యోగులు, విద్యార్థులు విజయవాడ వెళ్లడానికి సమయానికి బస్సులు లేక ఆలస్యంగా వెళ్లడంతో జీతాలలో కోతలు విధిస్తున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి మహిళలు ఇబ్బంది పడకుండా సరిపడా బస్సు సర్వీసులు అందుబాటులో ఉంచాలని మహిళా ప్రయాణికులు కోరుతున్నారు.



శతాధిక వృద్ధుడికి సన్మానం



నూజివీడు: పట్టణానికి చెందిన శతాధిక వృద్ధుడు అడుసుమిల్లి పట్టాభిరామారావును రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నూజివీడు యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. సంఘ అధ్యక్షుడు వంగల గోవిందరావు నేతృత్వంలో కార్యవర్గ సభ్యులంతా కలిసి సూపర్ సీనియర్ సిటిజన్ అడుసుమిల్లి పట్టాభి రామారావు(101)ని ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా సన్మానించారు. అనంతరం ఆయన జీవన విధానాన్ని పట్టాభి రామారావు అల్లుడైన డాక్టర్ వల్లభనేని రాఘవరావుని అడిగి తెలుసుకున్నారు. ఆయన స్టీమ్ ఇంజిన్ నుంచి కంప్యూటర్ వరకు అనేక రకాల ప్రగతిని చూశారని, భారతదేశం అనేక రంగాల్లో అభివృద్ధిని చూశారని చెప్పారు. కార్యక్రమంలో రిటైర్డ్ తెలుగు పండితులు ఈమని శేషయ్య, రిటైర్డ్ హెచ్‌ఎం కేవీ శివశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

భూ పంపిణీతోనే పేదరిక నిర్మూలన

వ్యవసాయ కార్మిక సంఘం నేత కోటేశ్వరరావు



ఇబ్రహీంపట్నం: పేదలకు భూపంపిణీ జరిగితేనే పేదరిక నిర్మూలన సాధ్యమని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం ఇబ్రహీంపట్నంలో ఆదివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం గ్రామీణ కష్ట జీవులకు అండగా నిలుస్తోందన్నారు. కార్మికులు, పేదల శ్రేయస్సు కోసం కులమతాలు, ప్రాంతీయ భేదాలు లేకుండా చేసిన వీరోచిత పోరాటాలను వివరించారు. ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని చెప్పారు. జిల్లా అధ్యక్షుడు ఉప్పెన నరసింహారావు, నాయకులు సీహెచ్ రాంబాబు, వెంకటేశ్వరరావు, దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

కొండచిలువ హతం



ఆగిరిపల్లి: మండలంలోని నరసింగపాలెంలో రైతులు 12 అడుగుల కొండచిలువను హతమార్చారు. ఆదివారం నరసింగపాలెంలో రైతు తన పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా అప్పటికే పొలంలో ఉన్న కొండచిలువ ఒక్కసారిగా రైతు పైకి దూసుకొచ్చింది. దీంతో రైతు గ్రామస్తుల సహాయంతో కొండచిలువను హతమార్చారు.

చిలుకూరివారిగూడెం జెడ్పీ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



మైలవరం: విజయవాడలో శనివారం జరిగిన డివిజన్ స్థాయి ఆటల పోటీల్లో జిల్లా స్థాయి జట్టుకు చిలుకూరివారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయిని అన్నే కుసుమకుమారి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ జూనియర్ బాలికల కబడ్డీకి సుప్రియ, మధు, తేజ, సీనియర్ బాలికల కబడ్డీకి స్వాతి, సాక్షి థాంసన్, దమయంతి, సీనియర్ బాలుర కబడ్డీకి గోపీచంద్, రామరాజు, జూనియర్ బాలుర కబడ్డీకి సాయి మధు ఎంపికయ్యారని వివరించారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయిని కుసుమకుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.

కొండపర్వ గ్రామంలో సంతకాల సేకరణ

కొండపర్వ(విస్సన్నపేట): మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం మండలంలోని కొండపర్వ గ్రామంలో ఆదివారం నిర్వహించారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు, సొసైటీ మాజీ అధ్యక్షుడు జి. చంద్రశేఖరరావు మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తే పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారని చెప్పారు. సర్పంచ్ జి. రమేష్‌బాబు, ఉప సర్పంచ్ పి. ప్రవీణ్, సోషల్ మీడియా కన్వీనర్ మంగయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



మునునూరు: మునునూరు హైస్కూల్ 2004–2005 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు తుక్కులూరు వద్ధాశ్రమంలో 100 మంది వృద్ధులకు ఆదివారం అన్నదానం చేశారు. మునునూరు హైస్కూల్లో చదివిన పూర్వ విద్యార్థులు ప్రతి నెలా మూడో ఆదివారం వృద్ధులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకొని భోజనం ఏర్పాటు చేస్తున్నామని, ఐదో నెల పూర్తి చేశామని చెప్పారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తొర్లపాటి శ్రీనివాసరావు, మద్దాల ఆంబ్రోస్, పల్లెపాము నవీన్, నల్లిబోయిన నాగరాజు, కూకటి రాజేష్, జంగం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా షాపులకు వర్షం దెబ్బ

మైలవరం: దీపావళి పండుగ సందర్భంగా మైలవరంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలకు వర్షం దెబ్బ తగిలింది. ఆదివారం మధ్యాహ్నం నుంచి వర్షం కురుస్తుండటంతో వినియోగదారులు క్రాకర్స్ షాపులకు కొనుగోలు చేయడానికి రాకపోవడంతో వ్యాపారులు ఇబ్బంది పడ్డారు. సాయంత్రానికి వర్షం తగ్గడంతో వ్యాపారులు ఊపిరి పీల్చుకున్నారు.